క్లుప్తంగా

విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై వినతి


వినతిపత్రం అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి దశల వారీ ఆందోళనలో భాగంగా యూఈఈయూ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో శనివారం సంఘ ప్రతినిధులు ఖమ్మం టౌన్, ఖమ్మం రూరల్ డీఈలకు వినతిపత్రాలు అందించారు. సిబ్బంది కొరతతో ఉద్యోగులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, ఉద్యోగులు, కార్మికుల నియామకాలు చేపట్టి పనిభారాన్ని తగ్గించాలని, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సంఘ ప్రతినిధులు డీఈలకు వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, టౌన్ డివిజన్, రూరల్ డివిజన్ ప్రతినిధులు లాలయ్య, సీహెచ్ ముకుందరెడ్డి, సీతయ్య, కమలాకర్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆయిల్‌పామ్ రైతులకు అవగాహన

ఖమ్మంఅర్బన్: ఖమ్మం బాలపేట వద్ద రఘునాథపాలెం బైపాస్ రోడ్డులో ఉన్న మార్కెట్ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్ మామిడితోటలో ఆదివారం ఆయిల్‌పామ్ రైతులకు అవగాహన సమావేశం ఏర్పాటుచేశారు. గోద్రేజ్ కంపెనీ అనుబంధంగా నిర్వహిస్తున్న ఈ సదస్సులో వైరా, ఖమ్మం తదితర ప్రాంతాల రైతులు పాల్గొనవచ్చని రాధాకిషోర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరవుతారని, రైతులు పాల్గొని ఆయిల్‌పామ్ సాగులో మెళకువలు తెలుసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం నగరంలోని టౌన్-1 సెక్షన్ 33/11 కేవీ దానవాయిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో 11 కేవీ లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపు కారణంగా ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ మౌలిక శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సారథినగర్, వెంకటేశ్వరనగర్, పద్మావతినగర్, జూబ్లీస్కూల్ ఏరియా, రాజీవ్ గృహకల్ప, జూబ్లీక్లబ్ రోడ్డు, ఫిష్ హౌస్ లైన్, బైపాస్ రోడ్, వాటర్ వర్క్స్, గణేష్‌నగర్, మేకల నారాయణ బోర్డు, కామంచికల్, దారేడు లైన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

అదేవిధంగా నగరంలోని టౌన్-3 సెక్షన్ 33/11 కేవీ ప్రభుత్వాస్పత్రి సబ్‌స్టేషన్ 11 కేవీ కలెక్టరేట్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా ఆదివారం ఉదయం 9 నుంచి 12 గంటలవరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ తావుర్యా తెలిపారు. ప్రభుత్వ ప్రధానాస్పత్రి, జిల్లా పరిషత్ కార్యాలయం, పాత కలెక్టర్ కార్యాలయాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

ఆర్టీసీ స్థలం స్వాధీనం

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని టీఎస్‌ఆర్టీసీ బస్టాండ్ స్థలంలో ఉన్న ఫంక్షన్ హాలు లీజ్ గడువు ముగియటంతో శనివారం ఆర్టీసీ అధికారులు స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆర్టీసీ బస్టాండ్ కోసం దాత ఇచ్చిన స్థలాన్ని అధికారులు లీజ్‌కు ఇచ్చారని స్థానికులు పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. ఇప్పటికైనా అధిరాలు స్పందించి బస్టాండ్‌లోకి రాకపోకలకు సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	40	బచ్చలికూర	4
వంకాయ	36		20
బెండకాయ	46	పాలకూర	3
పచ్చిమిర్చి	88		20
కాకర	56	చుక్కకూర	3
బీర	58		20
దొండ	30	తోటకూర	4
పొట్లకాయ	40		10
చిక్కుడు	110	గోంగూర	4
గోరుచిక్కుడు	50		20
క్యాబేజీ	24	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	24		20
ఆలుగడ్డ	34	కొత్తిమీర	1
చామగడ్డ	50		30
క్యారెట్	46	పుదీన	1
క్యాప్సికం	60		20

-ఖమ్మం వ్యవసాయం

చెత్తకు చెక్..

బయోమైనింగ్‌తో శుద్ధి అవుతున్న చెత్తాచెదారం

- డంపింగ్‌యార్డ్‌లో కొనసాగుతున్న ప్రక్రియ
- రోజుకు 650 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు శుభ్రం
- మరో ఏడాదిలో పూర్తికానున్న లక్ష్యం


బయో మైనింగ్ చేస్తున్న యంత్రం

ఖమ్మంమయూరిసెంటర్: చెత్త సమస్యకు బయోమైనింగ్ పరిష్కారం చూపుతోంది. నగరంలో సేకరించిన చెత్తను కార్పొరేషన్ సిబ్బంది దానవాయిగూడెం డంపింగ్‌యార్డులో వేస్తుండటంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కానీ ప్రస్తుతం చేపడుతున్న బయోమైనింగ్‌తో చెత్త శుభ్రమవుతోంది. దీంతో నగరంలో ప్రధానమైన సమస్యకు పరిష్కారం లభించినట్లయింది. అలాగే బయోమైనింగ్‌తో కంపోస్ట్ ఎరువు కూడా తయారుకానుంది. ప్రతిరోజు 650 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు ఈ బయోమైనింగ్ ద్వారా శుద్ధి అవుతున్నాయి.

ఏళ్ల సమస్యకు పరిష్కారం..

దానవాయిగూడెం డంపింగ్‌యార్డులో కొన్నేళ్లుగా చెత్తను పడేస్తున్నారు. దీంతో చెత్త గుట్టలు గుట్టలుగా పేరుకుపోవడంతో పరిసర ప్రాంతాలకు దుర్వాసన వెదజల్లడంతోపాటు పలుసార్లు నిప్పు అంటుకోవడంతో రవ్వలు ఎగిసిపడుతున్నాయి. ఇది అక్కడి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసింది. అంతేకాక పొగ కమ్మేసి పరిసరాల ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఈ నేపథ్యాన ఈ డంపింగ్ యార్డులో ఉన్న వ్యర్థాలను బయోమైనింగ్ చేసేందుకు క్యూబ్ సంస్థ కేఎంసీతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డంపింగ్‌యార్డులో 2.70 లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను బయోమైనింగ్ చేయాల్సి ఉంది. గతేడాది జనవరి నెలలో ప్రాసెస్ ప్రారంభించిన సంస్థ ఇప్పటి వరకు 65 వేల మెట్రిక్ టన్నుల చెత్తను ప్రాసెస్ చేశారు.

ఈ ఏడాదిలోగా లక్ష్యం పూర్తి..

దానవాయిగూడెంలోని డంపింగ్‌యార్డు 38 ఎకరాల స్థలంలో విస్తరించి ఉంది. ఈ డంపింగ్‌యర్డ్‌లో ఇప్పటి వరకు 10 ఎకరాల స్థలంలో గల వ్యర్థాలను బయోమైనింగ్ చేసి, ఆ స్థలాన్ని కేఎంసీకి అప్పగించారు. ఇక మరో ఐదు ఎకరాల స్థలాన్ని ఈ నెలాఖరుకు కేఎంసీకి అందజేయనున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్, మే నెల వరకు బయోమైనింగ్ పూర్తి చేయడం జరుగుతుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. వర్షాకాలంలో వ్యర్థాలను గుట్టలుగా ఏర్పాటు చేసి, వర్షాలు లేని సమయంలో చెత్తను ఆరదీసి బయోమైనింగ్ చేయడం జరుగుతుందన్నారు.

రోజుకు 650 మెట్రిక్ టన్నులు..


బయోమైనింగ్ యంత్రాల్లోకి జేసీబీతో వ్యర్థాలను నింపుతున్న దృశ్యం



ప్లాస్టిక్ వ్యర్థాల తరలింపునకు లారీలో లోడ్ చేస్తూ..

ప్రతీరోజు డంపింగ్‌యార్డులో ఉన్న వ్యర్థాలను రెండు యంత్రాలతో శుద్ధి చేస్తున్నారు. ఈ యంత్రాలతో రోజుకు 650 మెట్రిక్ టన్నుల వరకు వ్యర్థాలను బయోమైనింగ్ చేస్తున్నారు. ప్లాస్టిక్ వంటి వ్యర్థాల (ఆర్‌డీఎఫ్)ను ఆరు వేల మెట్రిక్ టన్నులు మహారాష్ట్ర చంద్రాపూర్‌లోని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీకి తరలించారు. కంపోస్ట్ ఎరువును పత్తి పంటల్లో వేసుకునేందుకు, పార్కుల్లో, డివైడర్లలో మొక్కలు పెంచేందుకు వినియోగిస్తున్నారు. సీఅండ్‌డీ (ఇనాట్- చిన్నచిన్న రాళ్లు)ని లోతట్టు ప్రాంతాల్లో, గుంతల్లో నింపేందుకు వినియోగిస్తారు.

చెరువు ఆక్రమణపై ఆందోళన


ఆక్రమణకు గురవుతున్న ప్రాంతం వద్ద సొసైటీ సభ్యులు


నిబంధనలకు విరుద్ధంగా తీసిన గుంతలు

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం చెరువు ఆక్రమణపై మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు ఆందోళన చేపట్టారు. చెరువును ఆనుకుని శనివారం కొందరు యంత్రాలతో మట్టి తీసి హద్దు కట్టలు వేస్తుండగా, సొసైటీ అధ్యక్షుడు ఖాసిం, ఉపాధ్యక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి అడ్డుకుని మత్సశాఖ ఏడీకి ఫిర్యాదు చేశారు. దీంతో శాఖ ఫీల్డ్‌మెన్ భాను చేరుకుని అనుమతి లేకుండా చెరువు శిఖంలో పనులు చేయవద్దని ఆదేశించారు. అనంతరం ఖాసిం, రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ చెరువు విస్తీర్ణం తేల్చేలా సర్వే చేయాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. ఈ విషయంలో అధికారులు స్పందించకపోతే ఆందోళనలు చేపడుతామని వెల్లడించారు.

ఇచ్చిన హామీలను అమలుచేయాలి


మాట్లాడుతున్న నాగేశ్వరరావు


తిరుమలాయపాలెం: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు కమ్మకోమటి నాగేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని పిండిప్రోలులో రాయల వెంకటనారాయణ భవనంలో మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖమ్మం, నలగొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్నకు పార్టీ మండల కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. అర్హత ఉన్న పేదలందరికీ రేషన్ కార్డులు, నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. మహిళలకు రూ.2,500 ఇస్తానన్న హామీ అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిమ్మిడి హనుమంతరావు, మండల కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లు, ఎడ్లపల్లి నవీన్, బానోతు శంకర్, గొడుగు విజయ్, పీఓడబ్ల్యూ పాలేరు డివిజన్ కార్యదర్శి గోకినపల్లి సరోజిని తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు


గుంతల్లో మట్టి నింపుతున్న దృశ్యం

రఘునాథపాలెం: మండలంలోని రాంక్యాతండాలో శనివారం పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. గ్రామంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని గ్రామస్తులు పంచాయతీ ప్రత్యేక అధికారి భాస్కరరావుకు విన్నవించగా నీరు నిలిచి మురుకికూపాలుగా ఉన్న ప్రాంతాలను ఆయన పరిశీలించారు. స్పందించి వెంటనే గ్రామ కార్యదర్శి గాంధీతో మురుగు గుంతల్లో మట్టి నింపించడం, వీధిలైట్లు ఏర్పాటు, సీసీ రోడ్లలో గుంతలకు మరమ్మతులు పనులు చేపట్టారు.

ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు


అలంకరణలో స్వామి వారు

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపూడి గ్రామంలో ఐదు రోజులుగా జరుగుతున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఉదయం గ్రామంలోని మహిళలతో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం గ్రామంలోని పలు వీధుల్లో స్వామి వారిని రథోత్సవంగా ఊరేగించారు. ప్రధాన అర్చకులు మురళీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.


స్వామివారి రథోత్సవంలో భక్తులు

పెయింటింగ్ పోటీల్లో ప్రథమ బహుమతి

ఖమ్మం సహకారనగర్: నగరంలోని వీడీవోస్ కాలనీలోని సర్వజ్ఞ పాఠశాల 8వ తరగతి విద్యార్థిని ప్రాహిన్యా చౌదరి రాష్ట్రస్థాయి ఆన్‌లైన్ పెయింటింగ్ పోటీల్లో జూనియర్స్ కేటగిరిలో ప్రథమ బహుమతి సాధించినట్లు డైరెక్టర్లు ఆర్‌వి నాగేంద్రకుమార్, కె.నీలిమలు తెలిపారు. ఈ మేరకు శనివారం పాఠశాలలో విద్యార్థినిని అభినందించారు. తమ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, పోటీ పరీక్షల్లో సైతం ముందుంటారన్నారు. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో ప్రాహిన్యా చౌదరి అవార్డు అందుకొవటం అభినందనీయమన్నారు. ప్రిన్సిపాల్ రజిని పాల్గొన్నారు.


విద్యార్థినితో పాఠశాల యాజమాన్యం

పారిశుద్ధ్య పనుల్లో 'రక్షణ' తప్పనిసరి

- కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి


డ్రెయినేజీని పరిశీలిస్తున్న కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మంమయూరిసెంటర్: పారిశుద్ధ్య పనులు చేసే సమయంలో కార్మికులు రక్షణ పరికరాలు, చేతి గ్లౌజ్‌లు, బూట్లు తప్పనిసరిగా వాడాలని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శనివారం నగరంలోని పలు డివిజన్లలో పర్యటించిన కమిషనర్ పనులు పరిశీలించి, జవాన్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో మాట్లాడారు. జవాన్‌ల వద్ద రికార్డులను పరిశీలించి కమిషనర్ సక్రమంగా లేనివి గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రెయినేజీలు శుభ్రం చేసిన తర్వాత రిజిస్టార్‌లలో స్థానికులతో సంతకాలు తీసుకోవాలని, ఆ పని జవాన్లు చేయాలని ఆదేశించారు. పెద్ద డ్రెయినేజీలు ఉన్న ప్రాంతాల్లో గ్యాంగ్ వర్క్ చేయించాలని, రైల్వేగేటు వద్ద డ్రెయినేజీలో ఉన్న వ్యర్థాలను జేసీబీలతో తొలగించాలని సూచించారు. అనంతరం దానవాయిగూడెం ఫిల్టర్‌బెడ్‌ను సందర్శించి నీటి నాణ్యతను స్వయంగా పరిశీలించారు. నీటి సరఫరా సమయపాలనను అడిగి తెలుసుకున్నారు. చెక్‌డ్యామ్ వద్ద నీటి నిల్వలను పర్యవేక్షించారు. దానవాయిగూడెంలో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులను పరిశీలించారు. కమిషనర్ వెంట పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, డీఈలు, ఏఈలు ఉన్నారు.

ప్రతీ కొనుగోలుకు రశీదు తీసుకోవాలి


నేలకొండపల్లి: మాట్లాడుతున్న ఏడీఏ విజయచంద్ర


ఖమ్మంరూరల్: తల్లంపాడులో విత్తన దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ నాగేశ్వరరావు

నేలకొండపల్లి: రైతులు కొనుగోలు చేసే ప్రతీ విత్తనాలకు సంబంధించిన రశీదులు తీసుకోవాలని కూసుమంచి ఏడీఏ ఎస్.విజయచంద్ర అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం ఎరువుల ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ డీలర్లతో సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...విత్తనాలు కొనుగోలు చేసిన వాటికి రశీదులు తప్పని సరిగా తీసుకుని, పంట కాలం అయ్యే వరకు భద్రంగా దాచుకోవాలని అన్నారు. డీలర్ల వద్ద కొనుగోలు చేసినప్పుడు బిల్లులతో పాటు, డీలర్ సంతకం, తయారీ, ఎక్స్పైరీ తేదీలను, ల్యాబ్ నెంబర్ల ను చూసుకోవాలని అన్నారు. గ్రామాలలో గుడ్డ సంచులతో విత్తనాలు విక్రయించే వారి వద్ద నుంచి ఎట్టి పరిస్థితులలో తీసుకోవద్దని సూచించారు. అలాంటి వారు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. లైసెన్స్ కలిగిన డీలర్ వద్దనే కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు అప్రమతంగా ఉండాలని అన్నారు. మండల వ్యవసాయాధికారి అరుణకుమారి, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు భద్రపరచుకోవాలి

ఖమ్మంరూరల్: రైతులు తాము విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లులను పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలని ఏఓ వి.నాగేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని తల్లంపాడులో రైతులతో జరిగిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడుతూ... విత్తనాలు కొనుగోలు సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎవరైనా లూజ్ ప్యాకెట్లలో, గుడ్డ సంచులలో బిల్లులు లేకుండా అమ్మినా, బీటీ విత్తనాల పేరుతో మోసం చేసినా సమాచారం అందించాలన్నారు. అనంతరం విత్తన దుకాణాలను తనిఖీ చేసి స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలనే ఇవ్వాలని, నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి

ఖమ్మం మామిళ్లగూడెం: మాజీ మంత్రులు హరీష్‌రావు, కేటీఆర్‌లు అసత్య ప్రచారాలు మానుకోవాలి బీజేపీ మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు ఆరోపించారు. శనివారం ఖమ్మంలోని ఓ హోటల్‌లో మాజీఎమ్మెల్యే మార్తినేని ధర్మారావుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ హైదరాబాదు ఉమ్మడి రాజధాని కింద ప్రయత్నం చేస్తుందని అసత్య ప్రచారం చేస్తున్నారని, బీఆర్‌ఎస్ పదేళ్లు పాలించిన తరువాత కూడా వారికి విభజనచట్టం గురించి తెలియకపోవటం దారుణమన్నారు. పార్టీలు ఫిరాయించేవారిని నమ్మొద్దని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజల పక్షాన నిలబడే గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలపించాలని కోరారు. ఈ సమావేశంలో కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, బీజేపీ ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు నున్న రవి, శ్యామ్‌రాథోడ్, చావా కిరణ్, కపిలవాయి రవీందర్, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాంచందర్‌రావు

ఆర్థికసాయం

రఘునాథపాలెం: మండలంలోని బూడిదంపాడులో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మహిళ కుటుంబాన్ని శనివారం కాంగ్రెస్ పార్టీ హెల్పింగ్ హ్యాండ్స్ బృందం పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. కొన్నినెలలుగా గ్రామంలో పేదలకు తమ వంతు సాయం అందజేస్తున్న హెల్పింగ్ గ్రూపు సభ్యులను గ్రామస్తులు అభినందించారు.

ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

తీన్మార్ మల్లన్నను గెలిపించాలి



ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో మిత్రపక్షాలు బలపరుస్తున్న కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు శనివారం ఖమ్మం నగరంలోని వివిధ డివిజన్‌లలో విస్తృతస్థాయిలో ప్రచారం నిర్వహించారు. 58వ డివిజన్‌లో నూకవరపు కోటేశ్వరరావు, కూచిపూడి శ్రీనివాస్, కుంచపు ఆశయ్య, రాపర్తినగర్‌లో శెట్టి రంగారావు, వీరన్న, సుదర్శన్, సోమిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, నాంపల్లి శంకరయ్య, ఉపేందర్, 35వ డివిజన్‌లో కల్వకుంట్ల గోపాల్, పండు, వెంకన్న, సాయికృష్ణ, ధనలక్ష్మీ, మంజుల, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని 25వ డివిజన్‌లో తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ రాష్ట్ర ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ వడ్డెబోయిన నర్సింహారావు ఆధ్వర్యంలో పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు దాసరి పూర్ణచందర్‌రావు, నాగిశెట్టి రాధాకృష్ణ, కోశాధికారి కృష్ణ, పబ్లిక్ సీటీ చైర్మన్ అనిశెట్టి గిరిబాబు, నాయకులు నాగభూషణం, శ్రీను, మోహన్, కూతురు రమేష్, ఎండి.ఖాదర్‌బాబా, తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నను గెలిపించేందుకు కృషి చేయాలి..

తీన్మార్ మల్లన్న గెలిపించేందుకు టీజేఎస్ శ్రేణులు కృషి చేయాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్‌రావు పిలుపునిచ్చారు. నగరంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు బెల్లంకొండ నాగేశ్వరరావు, యువజన నాయకులు భట్టు రాజేందర్ నాయక్, ఖమ్మం నగర నాయకులు డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.


ఖమ్మంవన్‌టౌన్: ప్రచారం చేస్తున్న శెట్టి రంగారావు, నాయకులు

మల్లన్నకు ఓటు వేసి గెలిపించాలని పూలే ఆశయ సాధన సమితిరాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సంగాని మల్లేశ్వర్ ఖమ్మంలో జరిగిన సమావేశంలో కోరారు. సర్దార్, ఎల్లయ్య, సుధాకర్, వెంకటేశ్వర్లు, గజవెల్లి సత్యనారాయణ, గోపాల్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంమయూరిసెంటర్: తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీసీ హక్కుల సాధన జిల్లా సమితి సీనియర్ నాయకులు సింగు నర్సింహారావు కోరారు. స్థానిక గిరిప్రసాద్ భవనంలో జరిగిన బీసీ హక్కుల సాధన సమితి ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేకల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు, నూనె శశిధర్, సీహెచ్ సీతమహాలక్ష్మి, పీట్ల కృష్ణమూర్తి, తాటి నిర్మల, చారి పాల్గొన్నారు.

ఖమ్మం సహకారనగర్: తీన్మార్ మల్లన్నను గెలిపించాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు కోరారు. సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎస్టీఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కె.మన్సూర్, నాయకులు టి.సుధాకర్, పోతగాని వెంకన్న, ఎస్‌కె.కరీముల్లా, పాశం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


ఖమ్మం మామిళ్లగూడెం: మాట్లాడుతున్న సంగాని మల్లేశ్వర్

రాకేష్‌రెడ్డి గెలుపు కోరుతూ..


తిరుమలాయపాలెం: పిండిప్రోలులో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

తిరుమలాయపాలెం: ఖమ్మం, వరంగల్, నల్లగొండ ఎమ్మెల్సీ స్థానానికి బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేస్తున్న ఏనుగుల రాకేష్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ శనివారం ఓటర్లను కలిసి అభ్యర్థించారు. నాయకులు పరికపల్లి చంద్రశేఖర్, చామకూరి రాజు, ముత్తయ్య, దూదిమెట్ల శ్రీను, మహేష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కామేపల్లి : కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ మండల వ్యాప్తంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం ముమ్మర ప్రచారం చేశారు. జెడ్పీటీసీ బానోత్ వెంకటప్రవీణ్‌కుమార్‌నాయక్ గోవింద్రాల గ్రామంలో పట్టభద్రులను కలిసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.